జాతీయ దిన పత్రిక
# తొలివెలుగు
మన భాష.. మన పత్రిక..
https://tholivelugu.com/
హైదరాబాద్ సంపుటి:01 సంచిక: 47 27-2-2026 వెల: రూ.2/- పేజీలు: 06







# కాళేశ్వరం అద్భుతం కాదు.. అపహాస్యం



- కాళేశ్వరం ప్రాజెక్టుపై పొంగులేటి ఘాటు వ్యాఖ్యలు
- కమిషన్ల కోసమే నిర్మాణమని ఆరోపణ
- సీబీఐ విచారణపై బీఆర్‌ఎస్‌బీజేపీపై విమర్శలు
- అసెంబ్లీలో చర్చకు రావాలని ప్రతిపక్షానికి సవాల్

తెలంగాణ ప్రధాన ప్రతిపక్ష నాయకులు రాష్ట్ర అభివృద్ధిని చూసి ఓర్వలేక విషం చిమ్ముతున్నారని రాష్ట్ర మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి మండిపడ్డారు. వరుస ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి పెరుగుతున్న ప్రజాదరణను చూసి బీఆర్‌ఎస్ నేతలు జీర్ణించుకోలేకపోతున్నారని ఆయన

మిగతా 2లో



# లోక్‌సభలో మాట్లాడనివ్వలేదు

- ట్రంప్ బెదిరింపులతోనే అమెరికాతో డీల్
- ఆ రెండు విషయాలు లేవనెత్తుతాననే లోక్‌సభలో మాట్లాడనివ్వలేదు
- కేంద్రంపై రాహుల్ గాంధీ విమర్శలు

2లో

## ఒక్కటైన టాలీవుడ్ స్టార్ జంట విజయ్ దేవరకొండ, రష్మిక మందన్న

- తమ పెళ్లి ఫొటోలను సోషల్ మీడియాలో పంచుకున్న రష్మిక
- విజయ్‌ను 'నా భర్త'గా పరిచయం చేస్తూ భావోద్వేగ పోస్ట్
- ఏళ్లుగా సాగుతున్న ప్రేమ ప్రచారానికి శుభం కార్డు
- విజయ్ వల్లే తాను కలలుగన్న మహిళగా మారానన్న నటి



# ఆ ప్రాజెక్టుతో ఏ రాష్ట్రానికీ నష్టం లేదు

- పోలవరం-నల్లమల అనుసంధానంతో రెండు రాష్ట్రాలకూ లాభమేనన్న సీఎం చంద్రబాబు
- వచ్చే ఏడాది మే 15 నుంచే నారుమళ్లకు నీరందించేలా ప్రణాళికలు సిద్ధం
- నీళ్లు రాకుండానే వెలిగొండకు రిబ్బన్ కట్ చేసి గత పాలకులు క్రెడిట్ కొట్టేశారు
- రాష్ట్రంలోని సాగునీటి ప్రాజెక్టులపై త్వరలోనే బ్లూప్రింట్ విడుదల చేస్తామని వెల్లడి
- ప్రతి ఎకరాకు నీరందించి తెలుగు తల్లికి జలహారతి ఇవ్వడమే లక్ష్యమని స్పష్టీకరణ
- శాసనసభలో సాగునీటి రంగంపై జరిగిన చర్చలో చంద్రబాబు ప్రసంగం



పోలవరం-నల్లమల సాగర్ అనుసంధాన ప్రాజెక్టుతో ఏ రాష్ట్రానికీ నష్టం జరగదని, దీనిపై పొరుగు రాష్ట్రం అభ్యంతరాలు వ్యక్తం చేయాల్సిన అవసరం లేదని ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టం చేశారు. వృథాగా సముద్రంలోకి పోతున్న గోదావరి వరద జలాలను మాత్రమే ఈ ప్రాజెక్టు ద్వారా తరలిస్తామని ఆయన శాసనసభలో వివరించారు. గోదావరిపై ఎగువ రాష్ట్రం కాళేశ్వరం ప్రాజెక్టు కట్టినప్పుడు తాము ఎన్నడూ అభ్యంతరం చెప్పలేదని గుర్తుచేశారు. ఈ అనుసంధాన ప్రాజెక్టు వల్ల రెండు తెలుగు రాష్ట్రాలకూ మేలు జరుగుతుందని ఆయన అన్నారు. గురువారం నాడు శాసనసభలో సాగునీటి రంగంపై జరిగిన చర్చలో ముఖ్యమంత్రి ప్రసంగించారు.

మిగతా 2లో



# "ఇజ్రాయిలీల కళ్లు చెమ్మగిల్లాయి"

## "హిందుత్వం-జియోనిజం".. మోడీ ఇజ్రాయిల్ పర్యటనపై ముస్లిం దేశాల మీడియా అక్కసు..

- మోడీ ఇజ్రాయిల్ పర్యటనపై ప్రపంచం ఆసక్తి..
- మోడీ విజిట్‌పై ముస్లిం దేశాల మీడియా అక్కసు..
- హిందుత్వ-జియోనిజం కలిశాయని విమర్శలు..

భారత ప్రధాని నరేంద్రమోడీ ఇజ్రాయిల్ పర్యటన ప్రపంచదేశాల్లో చర్చనీయాంశంగా మారింది. ముఖ్యంగా మిడిల్ ఈస్ట్, అరబ్ దేశాలలో ఈ పర్యటన పట్ల చాలా ఆసక్తి నెలకొంది. ఇజ్రాయిల్ ప్రధాని మోడీని ఘనంగా స్వాగతించింది. ఇజ్రాయెల్ పార్లమెంట్, నెస్సెట్‌ను ఉద్దేశించి ప్రధాని ప్రసంగించారు. ఇలా ఒక భారత ప్రధాని ఆ దేశ పార్లమెంట్‌లో మాట్లాడటం ఇదే మొదటిసారి. ప్రధాని మోడీకి "మెడల్ ఆఫ్ దిన నెస్సెట్"ను ఇజ్రాయిల్ బహూకరించింది. రెండు దేశాలు కూడా తమ సంబంధాలను మరింత బలోపేతం చేసుకోవాలని భావిస్తున్నాయి. అక్టోబర్

- మిగతా 2వ పేజీలో



ఏపీ మద్యం స్కాంలో కీలక పరిణామం..

## సిట్ ముందు లొంగిపోయిన ముప్పిడి అవినాశ్ రెడ్డి

- సుప్రీంకోర్టు ఆదేశాలతో ఇవాళ లొంగిపోయిన అవినాశ్ రెడ్డి
- వైసీపీ హయాంలో జరిగిన రూ.3,500 కోట్ల స్కాంలో ఈయన ఏ7 నిందితుడు
- ఎన్టీఆర్ జిల్లా పోలీస్ కమిషనర్ నేతృత్వంలో కొనసాగుతున్న సిట్ దర్యాప్తు

2లో

# బీఆర్‌ఎస్ అధికారంలోకి రాగానే ఇదే స్థలంలో ఇళ్లు కట్టిస్తాం: కేటీఆర్

- వెలుగుమట్ల భూదాన్ భూ బాధితులను కలిసిన కేటీఆర్
- 60 ఎకరాల భూమిపై ముగ్గురు మంత్రుల కన్ను పడిందని ఆరోపణ
- పోలీసుల పహారాలో పేదల ఇళ్లను కూల్చేశారని మండిపాటు

ఖమ్మం జిల్లా వెలుగుమట్లలో భూదాన్ భూ బాధితులను బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ కలిశారు. ఈ సందర్భంగా మీడియాతో ఆయన మాట్లాడుతూ... శత్రుదేశంపై దండయాత్రకు వెళ్లినట్లు 4000 మంది పోలీసుల పహారాలో పేదల ఇళ్లను కూల్చివేయడం ఇందిరమ్మ రాజ్యమా? అని నిలదీశారు. బాధితులకు అండగా ఉంటామని, బీఆర్‌ఎస్ అధికారంలోకి రాగానే ఇదే స్థలంలో ఇళ్లు కట్టించి ఇచ్చే బాధ్యత తనదని ఆయన భరోసా ఇచ్చారు. ఖమ్మం జిల్లాకు చెందిన ముగ్గురు మంత్రులు భట్టి విక్రమార్క,





# దక్షిణాదిపై జనసేన గురి

- 'మెంబర్‌షిప్ టు లీడర్‌షిప్' లక్ష్యంగా నేటి నుంచి ఐదు రాష్ట్రాల్లో సభ్యత్వ సమరభేరి
- మూడో విడత సభ్యత్వ నమోదుకు జనసేన శ్రీకారం
- ఏపీ, టీజీ, తమిళనాడు, కర్ణాటక, మహారాష్ట్రలలో సభ్యత్వ నమోదు కార్యక్రమం
- ఉద్యమి, సాధక్, ప్రదాత పేర్లతో మూడు వర్గాలుగా సభ్యత్వాలు

# బీఆర్ఎస్ అధికారంలోకి రాగానే ఇదే స్థలంలో ఇళ్లు కట్టిస్తాం

పొంగులేటి శ్రీనివాసరెడ్డి, తుమ్మల నాగేశ్వరరావులే ఈ అక్రమాలకు సూత్రధారులని కేటీఆర్ ఆరోపించారు. సుమారు 60 ఎకరాల విలువైన భూదాన్ భూములపై మంత్రుల కన్ను పడిందని, వారి అక్రమ సంపాదన కోసమే పేదలను రోడ్డున పడేశారని మండిపడ్డారు. ప్రభుత్వం ఎలాంటి తప్పు చేయకపోతే ముగ్గురు మంత్రులు నేరుగా ఇక్కడికి వచ్చి బాధితులకు సమాధానం చెప్పాలని సవాల్ విసిరారు. ఏ తప్పు జరగనప్పుడు ఆర్డీవోను ఎందుకు బదిలీ చేశారని ప్రశ్నించిన ఆయన, ఒక అధికారిని బలిపశువు చేసి ప్రభుత్వం తప్పించుకోవాలని చూస్తోందని విమర్శించారు. పేదల ఉసురు తగిలి తీరుతుందని, అధికారులను అడ్డం పెట్టుకుని ప్రజల మధ్య చిచ్చు పెడుతున్న మంత్రుల వైఖరిని అసెంబ్లీలోనూ, కౌన్సిల్‌లోనూ ఎండగడతామని కేటీఆర్ హెచ్చరించారు. పట్టాలు సక్రమంగా ఉన్నా, కేవలం కాంగ్రెస్ నేతల వంకర బుద్ధితోనే ఈ దాడులు జరిగాయని ధ్వజమెత్తారు. "ఒకప్పుడు దేశంలో ఒరిజినల్ గాంధీలు ఉండేవారు, ఇప్పుడు డూప్లికేట్ గాంధీలు తయారయ్యారు" అంటూ ఎద్దేవా చేశారు. పేదల ఇళ్లు కూల్చిన పాపం మంత్రులను విడిచిపెట్టదని అన్నారు.

# కాళేశ్వరం అద్భుతం కాదు.. అపహాస్యం

విమర్శించారు. గురువారం ఆయన మీడియాతో మాట్లాడుతూ ప్రాజెక్టుల అవినీతిపై కీలక వ్యాఖ్యలు చేశారు. ప్రపంచంలోనే ఎనిమిదో అద్భుతంగా చెప్పుకున్న కాళేశ్వరం ప్రాజెక్టు కేవలం కమిషన్ల కోసమే కట్టారని పొంగులేటి ఆరోపించారు. "38 వేల కోట్లతో పూర్తి కావాల్సిన తుమ్మిడిహెట్టి ప్రాజెక్టును పక్కనపెట్టి, తమ రాచరికాన్ని చాటుకోవడం కోసం లక్షల కోట్లతో కాళేశ్వరం నిర్మించారు. తీరా చూస్తే ఎన్నికల ముందు ఆ ప్రాజెక్టు పేకమేడలా కూలిపోయింది" అని ఎద్దేవా చేశారు. గత నాలుగేళ్లలో 162 టీఎంసీల నీటిని లిఫ్ట్ చేస్తే, అందులో 50 టీఎంసీలు తిరిగి సముద్రం పాలయ్యాయని ఆయన గణాంకాలతో వివరించారు. కాళేశ్వరం అవినీతిపై సీబీఐ విచారణ కోరినప్పటికీ, బీఆర్ఎస్ , బీజేపీల మధ్య ఉన్న అంతర్గత 'ఫెవికల్' బంధం వల్లే విచారణ ముందుకు సాగడం లేదని మంత్రి ఆరోపించారు. కేంద్ర సంస్థల నివేదికల ఆధారంగానే తాము జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్‌ను ఏర్పాటు చేశామని, కానీ దీనిపై అసెంబ్లీలో చర్చ జరిగే సమయంలో ప్రతిపక్ష సభ్యులు పారిపోయారని దుయ్యబట్టారు. "సభలో చర్చకు రమ్మంటే కుంటిసాకులు చెప్పే బావబావమరుదులు (కేసీఆర్, కేటీఆర్, హరీష్ రావులను ఉద్దేశించి), బయట మాత్రం అచ్చోసిన ఆంబోతుల్లా రంకెలు వేస్తున్నారు" అని పొంగులేటి ఘాటుగా విమర్శించారు. నిత్యం పెయిడ్ ఆర్టిస్టులతో సోషల్ మీడియాలో విషం చిమ్ముతూ, శవాల మీద చిల్లర ఏరుకునే రకంగా ప్రతిపక్షం వ్యవహరిస్తోందని మండిపడ్డారు. ప్రజలు వీరి నిజస్వరూపాన్ని చూశారు కాబట్టే అన్ని ఎన్నికల్లో ఓడగొట్టారని గుర్తు చేశారు. తెలంగాణ ప్రయోజనాల విషయంలో కాంగ్రెస్ ప్రభుత్వం రాజీ పడదని మంత్రి స్పష్టం చేశారు. కృష్ణా పరివాహక ప్రాంత నీటిని నల్గొండ, ఖమ్మం, మహబూబ్ నగర్ వాసులకు అందించడమే తమ లక్ష్యమని పేర్కొన్నారు. గత ప్రభుత్వ స్వార్థ నిర్ణయాల వల్ల రాష్ట్రం 15 ఏళ్లు వెనక్కి పోయిందని, రేవంత్ రెడ్డి నాయకత్వంలో రాష్ట్రాన్ని మరో 15 ఏళ్లు ముందుకు తీసుకెళ్తామని ధీమా వ్యక్తం చేశారు. ప్రాజెక్టుల పనులపై చర్చకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని, ప్రతిపక్షం దమ్ముంటే అసెంబ్లీకి రావాలని ఆయన సవాల్ విసిరారు.

# దక్షిణాదిపై జనసేన గురి

రాజకీయాల్లో సరికొత్త మార్పు కోసం జనసేనాని పవన్ కల్యాణ్ వ్యూహాత్మక అడుగులు వేస్తున్నారు. సంస్థాగతంగా పార్టీని పటిష్ఠం చేయడమే లక్ష్యంగా, 'మెంబర్‌షిప్ టు లీడర్‌షిప్' అనే శక్తిమంతమైన నినాదంతో మూడో విడత క్రియాశీలక సభ్యత్వ నమోదుకు నేడు జనసేన శ్రీకారం చుట్టింది. ఇప్పటివరకు పిఠాపురం నియోజకవర్గానికే పరిమితమైన ఈ కార్యక్రమం, నేటి నుంచి విస్తృత రూపం దాల్చనుంది. కేవలం ఆంధ్రప్రదేశ్ కే పరిమితం కాకుండా తెలంగాణ, కర్ణాటక, తమిళనాడుతో పాటు మహారాష్ట్రలోనూ తన ఉనికిని చాటుకోవాలని పార్టీ అధిష్ఠానం నిర్ణయించడం రాజకీయ వర్గాల్లో ఆసక్తిని రేకెత్తిస్తోంది. రాబోయే పార్టీ ఆవిర్భావ దినోత్సవం నాటికి భారీ స్థాయిలో సభ్యులను చేర్చుకోవడం ద్వారా కేడర్ బలాన్ని ప్రదర్శించాలని అధినేత పవన్ కల్యాణ్ స్పష్టమైన లక్ష్యాన్ని నిర్దేశించారు. ఈసారి క్రియాశీలక సభ్యత్వ రుసుమును రూ. 500 నుండి రూ. 400కు తగ్గించి సామాన్యులకు మరింత చేరువయ్యే ప్రయత్నాన్ని జనసేన చేస్తోంది.

# లోక్‌సభలో మాట్లాడనివ్వలేదు

(మొదటి పేజీ తరువాయి)

ట్రంప్ బెదిరింపులతోనే అమెరికాతో ప్రధాని మోడీ వాణిజ్య ఒప్పందం చేసుకున్నారని కాంగ్రెస్ అగ్ర నేత, లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ ఆరోపించారు. కేరళంలోని కన్నూర్‌లో జరిగిన ఒక కార్యక్రమంలో రాహుల్ గాంధీ ప్రసంగించారు. "అమెరికన్ రైతులు భారతదేశంలో సోయాబీన్, మొక్కజొన్న, పండ్లను అమ్మడానికి అనుమతించడం ఏ భారతీయ ప్రధానమంత్రి కూడా ఇలా అనుమతించరు. భారతదేశ పునాదిని బీజేపీ నాశనం చేయబోతోంది. 4 నెలలుగా భారతదేశం-అమెరికా వాణిజ్య ఒప్పందం నిలిచిపోయింది. భారత ప్రభుత్వం.. అమెరికన్ కంపెనీలకు భారత వ్యవసాయాన్ని తెరవడానికి ఇష్టపడలేదు. కానీ అధ్యక్షుడు ట్రంప్.. ప్రధానమంత్రి మోడీని బెదిరించారు. దీంతో లొంగిపోయారు. పార్లమెంటులో రాష్ట్రపతి ప్రసంగంపై వారు నన్ను మాట్లాడనివ్వలేదు. అమిత్ షా లేచారు. ప్రధానమంత్రి మోడీ నన్ను మాట్లాడనివ్వలేదు. స్పీకర్ కూడా అదే చేశారు. భారత చరిత్రలో మొదటిసారిగా ప్రతిపక్ష నేతను రాష్ట్రపతి ప్రసంగంపై మాట్లాడనివ్వలేదు. వారు నన్ను ఎందుకు ఆపారు? ఎందుకంటే భారత ప్రధాని మోడీ చిక్కుకున్న రెండు సమస్యల గురించి నేను మాట్లాడబోతున్నానని వారికి తెలుసు. ఎప్‌స్టీన్ ఫైల్స్, అమెరికాలో అదానీ కేసు గురించి." అని అన్నారు.

# "ఇజ్రాయిలీల కళ్లు చెమ్మగిల్లాయి"

(మొదటి పేజీ తరువాయి)

07, 2023న ఇజ్రాయిల్‌పై హమాస్ చేసిన దాడిని ప్రధాని మోడీ తీవ్రంగా ఖండించారు. ఇజ్రాయిల్ బాధల్లో భారత్ అండగా ఉంటుందని చెప్పారు. యూదు, హిందూ ధర్మాల సారూప్యాన్ని కొనియాడారు. అరబ్ దేశాలతో ఇజ్రాయిల్ చేసుకున్న "అబ్రహం ఒప్పందాన్ని" ప్రధాని ప్రశంసించారు. 2ఖ2 (భారతదేశం-ఇజ్రాయెల్, యునైటెడ్ స్టేట్స్-యుఎఇ),×వీజుజ (భారతదేశం-మధ్యప్రాచ్యం-యూరప్ ఆర్థిక కారిడార్) వంటి వేదికల ద్వారా భారత్-ఇజ్రాయిల్ సహకారాన్ని పెంచుకోవాలని మోడీ పిలుపునిచ్చారు. ఇదిలా ఉంటే.. గల్ఫ్, మిడిల్ ఈస్ట్‌లోని ఇస్లాం దేశాల మీడియా ప్రధాని మోడీ ఇజ్రాయిల్ పర్యటనపై తమ అక్కసును వెళ్లగక్కాయి. "భారతదేశ ప్రధాని మోడీ నెస్సెట్‌లో ఇజ్రాయెల్‌ను బహిరంగంగా ప్రశంసించారు, ఇది గాజా యుద్ధం కారణంగా అంతర్జాతీయ ఒత్తిడిని ఎదుర్కొంటున్న నెతన్యాహుకు ప్రధాన దౌత్య విజయంగా పరిగణించబడుతుంది." అని టర్కిష్ మీడియా సంస్థ టీఆర్టీ వరల్డ్ నివేదించింది. అంతర్జాతీయ న్యాయస్థానం ప్రకటించిన నేరస్తుడు నెతన్యాహును మోడీ ఆలింగనం చేసుకున్నారు. హమాస్‌ను ఖండించారు. కానీ గాజా గురించి ప్రస్తావించలేదు. గాజాలో ఇజ్రాయిల్ చేసిన మరణాలు, భారీ నష్టాల గురించి మోడీ మౌనంగా ఉన్నారు" అని నివేదించింది. "ఈ పర్యటన భారతదేశ సాంప్రదాయ పాలస్తీనా అనుకూల విధానం నుంచి ఒక ప్రధాన సైద్ధాంతిక మార్పును సూచిస్తుంది. గాజాలో మానవతా సంక్షోభం కన్నా వ్యూహాత్మక లాభాలకే ఎక్కువ ప్రాధాన్తయ ఇచ్చారు. నెతన్యాహూ, మోడీ, ఇద్దరూ



జాతీయవాదు, ప్రజాదరణ పొందిన వారు. కాశ్మీర్, పాలస్తీనా, వెస్ట్ బ్యాంక్ వంటి వివాదాలు రెండు దేశాలకు ఉన్నాయి" అని అల్ జజీరా కవరేజ్ ఇచ్చింది.

మిడిల్ ఈస్ట్ ఐ మీడియా.. " నెస్సెట్‌లో మోడీ ప్రసంగం భారత్ దీర్ఘకాలిక విదేశాంగ విధానం నుంచి నిష్క్రమణను సూచిస్తుంది. హిందుత్వ-జియోనిజం మధ్య సైద్ధాంతిక కలయికకు నిదర్శనం" అని రాసింది. "ఇజ్రాయిల్ గాజాలో సైనిక కార్యకలాపాలు కొనసాగిస్తున్న సమయంలో మోడీకి ఆ దేశ పార్లమెంట్‌లో స్టాండింగ్ ఒవేషన్ కేవలం లాంఛనప్రాయం కాదు. రాజకీయ సందేశం. యుద్ధ నేరాల ఆరోపణల నేపథ్యంలో మోడీ ఆ దేశానికి వెళ్లడం ద్వారా ఇజ్రాయిల్ పూర్తిగా ఒంటరిగా లేదని సూచిస్తుంది" అని పాలస్తీనా క్రానికల్ రాసింది.

ప్రధాని మోదీ ప్రసంగం గురించి పాకిస్తాన్ వార్తాపత్రిక డాన్ .. "తన ప్రసంగంలో, గాజాలో రెండు సంవత్సరాలకు పైగా జరిగిన యుద్ధంలో మరణించిన వేలాది మంది పాలస్తీనియన్ల గురించి మోడీ ప్రస్తావించలేదు. ఈ ప్రాంతంలో శాంతి, స్థిరత్వం కోసం భారతదేశం చేసే ప్రతి ప్రయత్నానికి మద్దతు ఇస్తుందని ఆయన అన్నారు. ఈ పర్యటనలో ఆయన ఏ పాలస్తీనా నాయకులను కలవలేదు." అని రాసింది.

# ఒక్కటైన టాలీవుడ్ స్టార్ జంట విజయ్ దేవరకొండ, రష్మిక మందన్న



కొన్నేళ్లుగా సాగుతున్న ప్రేమ ప్రయాణానికి అధికారికంగా ముగింపు పలుకుతూ, సినీ అభిమానులంతా ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న శుభవార్తను నటి రష్మిక మందన్న స్వయంగా ప్రకటించారు. తన ప్రియుడు, స్టార్ హీరో విజయ్ దేవరకొండతో ఏడడుగులు నడిచానని, ఇకపై అతడే తన భర్త అని ప్రపంచానికి పరిచయం చేశారు. తమ సంప్రదాయ వివాహ వేడుకకు సంబంధించిన అందమైన ఫోటోలను ఇన్‌స్టాగ్రామ్ వేదికగా పంచుకుంటూ, విజయ్‌పై తనకున్న ప్రేమను అక్షర రూపంలో ఆవిష్కరించారు. ఈ పోస్ట్ క్షణాల్లోనే సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. "హాయ్ మై లవ్స్.. ఇప్పుడు మీకు నా భర్తను పరిచయం చేస్తున్నాను! మిస్టర్ విజయ్ దేవరకొండ!!" అంటూ రష్మిక తన సుదీర్ఘ పోస్ట్‌ను ప్రారంభించారు. "నిజమైన ప్రేమంటే ఎలా ఉంటుందో, మనతో మనం ప్రశాంతంగా ఉండటం ఎలాగో నాకు నేర్పించిన వ్యక్తి ఇతడే. పెద్ద కలలు కనడం సరైందేనని, నేను ఊహించిన దానికంటే ఎక్కువే సాధించగలనని ప్రతిరోజూ నాకు గుర్తుచేస్తూ, నిరంతరం ప్రోత్సహించిన వ్యక్తి" అని విజయ్ తన జీవితంలో పోషించిన పాత్రను వివరించారు. అతడి గురించి ఓ పుస్తకమే రాయొచ్చని చమత్కరించారు. ఓ మహిళగా నేను ఎలా ఎదగాలని అనుకున్నానో, ఆ విధంగా మారగలిగానంటే అందుకు విజయ్ నే కారణమని స్పష్టం చేశారు. "అందరిముందు డ్యాన్స్ చేయకుండా నన్ను ఎప్పుడూ ఆపలేదు. స్నేహితులతో కలిసి ప్రయాణం చేయడం ఎంత అద్భుతంగా ఉంటుందో చూపించాడు. నేను ఈ రోజు ఇలా ఉన్నానంటే, దాని వెనుక ఉన్నది అతడే. నేను నిజంగా ఆశీర్వదించబడ్డాను" అని పేర్కొన్నారు. తన జీవితంలోని ప్రతీ ఘట్టానికి ఇప్పుడు ఓ అర్థం వచ్చిందని రష్మిక భావోద్వేగంతో తెలిపారు. "ఇప్పుడు నా విజయాలు, కష్టాలు, సంతోషం, బాధ, ఆనందం.. నా జీవితంలోని ప్రతిదీ మరింత అర్థవంతంగా మారింది. ఎందుకంటే వాటన్నింటికీ సాక్షిగా, అందులో అతిపెద్ద భాగంగా నువ్వు నా పక్కన ఉన్నావు" అని రాసుకొచ్చారు. విజయ్‌తో కొత్త జీవితాన్ని ప్రారంభించడంపై తన ఉత్సాహాన్ని దాచుకోలేకపోయారు. "నీ భార్యగా మారడానికి, నీ భార్య అని పిలిపించుకోవడానికి నేను చాలా చాలా చాలా ఎగ్జైటింగ్‌గా ఉన్నాను. ఇక ఫుల్ పార్టీ టైమే!! మనం కలిసి అత్యద్భుతమైన జీవితాన్ని గడుపుదాం! ఐ లవ్ యూ" అంటూ తన పోస్ట్‌ను ప్రేమగా ముగించారు. రష్మిక షేర్ చేసిన ఈ ఫెయిరీ టేల్ వెడ్డింగ్ ఫోటోలు చూసి అభిమానులు, సినీ ప్రముఖులు కొత్త జంటకు శుభాకాంక్షలు తెలుపుతున్నారు.

ఏపీ మద్యం స్కాంలో కీలక పరిణామం..

# సిట్ ముందు లొంగిపోయిన ముప్పిడి అవినాశ్ రెడ్డి

ఏపీ మద్యం కుంభకోణం కేసులో కీలక పరిణామం చోటుచేసుకుంది. ఈ కేసులో ఏడో నిందితుడిగా ఉన్న ముప్పిడి అవినాశ్ రెడ్డి ఇవాళ విజయవాడలోని ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) ఎదుట లొంగిపోయారు. ముందస్తు బెయిల్ మంజూరు చేసేందుకు సుప్రీంకోర్టు నిరాకరించి, ఈ నెల 26లోగా లొంగిపోవాలని ఆదేశించిన రెండు రోజులకే ఆయన సిట్ విచారణకు హాజరయ్యారు. భారత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ నేతృత్వంలోని ధర్మాసనం, అవినాశ్ రెడ్డి కచ్చితంగా లొంగిపోయి దర్యాప్తునకు సహకరించాలని స్పష్టం చేసింది. అరెస్టు నుంచి రక్షణ కల్పించాలన్న ఆయన అభ్యర్థనను తిరస్కరించింది. అయితే, ట్రయల్ కోర్టులో రెగ్యులర్ బెయిల్ కోసం దరఖాస్తు చేసుకునేందుకు స్వేచ్ఛనిచ్చింది. అంతకుముందు ఏపీ హైకోర్టు ఆయన ముందస్తు బెయిల్ పిటిషన్‌ను కొట్టివేయడంతో అవినాశ్ రెడ్డి సర్వోన్నత న్యాయస్థానాన్ని ఆశ్రయించారు. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో (2019-24) ఎక్సైజ్ పాలసీని మార్చి, డిస్టిలరీల నుంచి ముడుపులు స్వీకరించడం ద్వారా సుమారు రూ.3,500 కోట్ల కుంభకోణం జరిగిందని ప్రధాన ఆరోపణ. మద్యం సరఫరాదారుల నుంచి కమీషన్ల రూపంలో వసూలు చేసిన డబ్బును అవినాశ్ రెడ్డి విదేశాలకు తరలించి మనీలాండరింగ్‌కు పాల్పడ్డారని అభియోగాలు నమోదయ్యాయి. ఆయన దేశం విడిచి పారిపోయాడని, ప్రధాన నిందితుడు రాజ్ కెసిరెడ్డి ఇందుకు సహకరించాడని ప్రాసిక్యూషన్ గతంలో కోర్టుకు తెలిపింది.ం2024లో టీడీపీ-ఎన్డీఏ కూటమి అధికారంలోకి వచ్చిన తర్వాత ఈ కుంభకోణంపై కేసు నమోదైంది. తొలుత ఎక్సైజ్ శాఖ అధికారి ఫిర్యాదుతో సీఐడీ దర్యాప్తు ప్రారంభించగా, తర్వాత ప్రభుత్వం కేసును లోతుగా విచారించేందుకు ఎన్టీఆర్ జిల్లా పోలీస్ కమిషనర్ ఎస్.వి. రాజశేఖర్ బాబు నేతృత్వంలో సిట్‌ను ఏర్పాటు చేసింది. ఈ కేసులో ఐపీసీ, అవినీతి నిరోధక చట్టంలోని పలు సెక్షన్ల కింద మంగళగిరి సీఐడీ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేశారు. వైసీపీ నేతలు తమకు అనుకూలమైన నూతన మద్యం పాలసీని ప్రోత్సహించి, కొత్త బ్రాండ్లను ప్రవేశపెట్టి, డిస్టిలరీ కంపెనీల నుంచి ముడుపులు స్వీకరించారని, తద్వారా ప్రభుత్వ ఖజానాకు భారీ నష్టం కలిగించారని సిట్ దర్యాప్తులో తేలినట్లు సమాచారం. ఈ కేసులో పలువురు ఎంపీలు, రిటైర్డ్ ఐఏఎస్ అధికారులు, డిస్టిలరీ కంపెనీల యజమానులను కూడా సిట్ నిందితులుగా చేర్చింది.


# ఆ ప్రాజెక్టుతో ఏ రాష్ట్రానికీ నష్టం లేదు

(మొదటి పేజీ తరువాయి)

మే 15కే నారుమళ్లకు నీళ్లు రాష్ట్రంలో నీటి భద్రతకు కూటమి ప్రభుత్వం దీర్ఘకాలిక ప్రణాళికతో ముందుకెళుతోందని చంద్రబాబు తెలిపారు. 2047 స్వర్ణాంధ్ర విజన్‌లో భాగంగా నీటి భద్రతకు అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నామని, పరిశ్రమలు, పెట్టుబడులకు నీరే కీలకమని అన్నారు. రాష్ట్రంలోని జలాశయాల్లో ప్రస్తుతం 793 టీఎంసీల నీరు నిల్వ ఉందని, అందుకే ఈసారి పంటల సీజన్‌ను ముందుకు జరిపి, వచ్చే ఏడాది మే 15 నుంచే నారుమళ్లకు నీరందించేలా ప్రణాళిక రచించామని ప్రకటించారు. ఈ విషయంపై రైతులను చైతన్యవంతం చేయాలని ప్రజాప్రతినిధులకు ఆయన సూచించారు. ప్రతి ఎకరాకు నీరందించి తెలుగు తల్లికి జలహారతి ఇవ్వడమే తన లక్ష్యమని, దీనికోసం రాష్ట్రంలోని సాగునీటి ప్రాజెక్టుల పూర్తిపై త్వరలోనే ఒక బ్లూప్రింట్ విడుదల చేస్తామని వెల్లడించారు.

### ప్రాజెక్టులన్నీ మా హయాంలో కట్టినవే

రాష్ట్రంలో నిర్మించిన ప్రాజెక్టులన్నీ తమ హయాంలోనివేనని చంద్రబాబు స్పష్టం చేశారు.



2014-19 మధ్య సాగునీటి రంగానికి రూ.68 వేల కోట్లు ఖర్చు చేశామని గుర్తుచేశారు. ఎన్టీఆర్ హయాంలోనే రాయలసీమకు తెలుగు గంగ, గాలేరు నగరి, హంద్రీనీవా వంటి ప్రాజెక్టులు వచ్చాయని, తాము పట్టిసీమ ద్వారా కృష్ణా డెల్టాకు నీళ్లిచ్చి, శ్రీశైలంలో 100 టీఎంసీలు రాయలసీమకు తరలించామని వివరించారు. అందుకే ఆ ప్రాంతం నేడు రతనాల సీమగా మారుతోందన్నారు. గత ప్రభుత్వంపై చంద్రబాబు తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పించారు. వెలిగొండ ప్రాజెక్టుకు నీళ్లు రాకుండానే రిబ్బన్ కట్ చేసి క్రెడిట్ కొట్టేసే ప్రయత్నం చేశారని ఎద్దేవా చేశారు. 30 ఏళ్ల క్రితం శంకుస్థాపన చేసిన ఆ ప్రాజెక్టు మొదటి దశను ఈ ఏడాది జూలైలోనే పూర్తి చేసి నీళ్లిస్తామని హామీ ఇచ్చారు. ప్రాజెక్టు పూర్తికి మరో రూ.2500 కోట్లు అవసరమని, ఇప్పటికే ఫీడర్ కెనాల్ లైనింగ్ పనులకు రూ.456 కోట్లతో శంకుస్థాపన చేశామని తెలిపారు. అదేవిధంగా కుప్పం కాలువలో ట్యాంకర్లతో నీళ్లు పోసి ప్రచారం చేసుకున్నారని విమర్శించారు. రాష్ట్రానికి జీవనాడి అయిన పోలవరం ప్రాజెక్టును విధ్వంసం చేసి డయాఫ్రాం వాల్‌ను గోదావరిలో కలిపేశారని ఆవేదన వ్యక్తం చేశారు. ఆ ప్రాజెక్టును మళ్లీ పరుగులు పెట్టించి పుష్కరాల కంటే ముందే పూర్తి చేస్తామన్నారు.

### ప్రాజెక్టుల్లో పుష్కలంగా నీరు

ప్రస్తుతం రాష్ట్రంలోని జలాశయాలు 793 టీఎంసీల నీటితో కళకళలాడుతున్నాయని సీఎం తెలిపారు. జల సంరక్షణ చర్యల వల్ల రాష్ట్రవ్యాప్తంగా భూగర్భ జలాలు సగటున 6 మీటర్లు పెరిగాయని, దీనివల్ల రూ.91 కోట్ల విద్యుత్ ఆదా అయిందని వివరించారు.

# వైభవంగా గరుడ సేవ.. పులకించిన గుట్ట


- గరుడ వాహనంపై విష్ణుమూర్తి అలంకారంలో స్వామి దర్శనం - భాజా భజంత్రీల నడుమ ఆలయ తిరువీధులలో వైభవంగా ఊరేగింపు
- వేద పండితుల మంత్రోచ్ఛారణలతో అభిషేకం, ప్రత్యేక పూజలు - కళ్యాణ మండపంలో అలంకార సేవ, ఉపనిషత్తుల పారాయణం
- మహా పూర్ణాహుతితో బ్రహ్మోత్సవాలకు శోభాయమాన ముగింపు దిశగా కార్యక్రమాలు







**యాదగిరిగుట్ట, ఫిబ్రవరి 26 (తొలివెలుగు):** యాదగిరిగుట్ట శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి దేవస్థానంలో నిర్వహిస్తున్న వార్షిక బ్రహ్మోత్సవాలలో భాగంగా గురువారం స్వామి అమ్మవార్లను విష్ణుమూర్తి అలంకారంలో అలంకరించి గరుడ వాహనంపై అధిష్టింపజేసి ఆలయ తిరువీధులలో ఘనంగా ఊరేగించారు. ఉదయం వేద పండితులు, రుత్వికులు పంచసూక్తాలు, పంచఉపనిషత్తుల పారాయణంతో స్వామి అమ్మవార్లకు అభిషేకం నిర్వహించారు. అనంతరం పట్టు వస్త్రాలు ధరింపజేసి, వివిధ రకాల పుష్పమాలికలతో శోభాయమానంగా అలంకరించారు. అలంకార సేవకు ముందు ఆలయ ప్రధాన అర్చకులు కాండూరు వెంకటాచార్యులు హారతినిచ్చారు. తదనంతరం గరుడ వాహనంపై స్వామి అమ్మవార్ల ఉత్సవమూర్తులను అధిష్టింపజేసి భాజా భజంత్రీలు, మంగళ వాయిద్యాల నడుమ సుమారు రెండు గంటలపాటు తిరువీధులలో ఊరేగింపు నిర్వహించారు. ఆ తర్వాత కళ్యాణ మండపంలో అలంకార సేవను అధిష్టింపజేసి ఉపనిషత్తుల పారాయణం చేశారు. అనంతరం స్వామి అమ్మవార్లను ఆలయంలోకి తీసుకువెళ్లి భక్తులకు తీర్థప్రసాదాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో భక్తులు, స్థానికులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ నరసింహమూర్తి, ఈవో భవాని శంకర్, డిఇఓ దుర్భల భాస్కర్ శర్మ, సురేంద్ర ఆచార్యులు, మాధవాచార్యులు, శ్రీధరాచార్యులు, నరేష్ కుమార్ ఆచార్యులు, శ్రీనాథ ఆచార్యులు, ఆలయ అధికారులు సీతారామాచార్యులు, గజల్ రఘు తదితరులు పాల్గొన్నారు.









## సీతారాముల నూతన గుడి నిర్మాణానికి శంకుస్థాపన


**వలిగొండ, ఫిబ్రవరి 26 (తొలివెలుగు):** యాదాద్రి భువనగిరి జిల్లా పరిధిలోని వలిగొండ మండలం పులిగిల్ల గ్రామంలో శ్రీ సీతారామచంద్రస్వామి దేవాలయం నూతన గుడి నిర్మాణానికి శంకుస్థాపన కార్యక్రమం వైభవంగా నిర్వహించారు. వేదమూర్తి పరమేశ్వర శాస్త్రి ఆధ్వర్యంలో గణపతి హోమం, శంకు చక్రధారణ కార్యక్రమాలు శాస్త్రోక్తంగా నిర్వహించగా, గ్రామ ప్రముఖులు పాల్గొని శంకుస్థాపన కార్యక్రమాన్ని ఘనంగా పూర్తి చేశారు. ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ.. సీతారామచంద్రస్వామి ఆలయ నిర్మాణానికి దాతలు ముందుకు వచ్చి విరాళాలు అందించాలని, స్వామివారి కృపకు పాత్రులు కావాలని ఆకాంక్షించారు. గ్రామ ప్రజల సహకారంతో ఆలయ నిర్మాణాన్ని వేగవంతంగా పూర్తి చేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ వేముల అనూష, పల్లెర్ల మల్లేష్, మాజీ సర్పంచ్ జక్కా వెంకట్ రెడ్డి, కొమ్మిడి లక్ష్మారెడ్డి, సెక్రటరీ సైదులు, మార్కెట్ కమిటీ డైరెక్టర్ జక్క దామోదర్ రెడ్డి, ఉప సర్పంచ్ వడ్డేమాన్ దేవేందర్, వార్డు సభ్యులు బుగ్గ కృష్ణ, సిలువేరు మహేష్, వేముల నాగరాజు, వేముల పుష్ప, వేముల అనిత, పర్వతం సంతోష, కంచి శ్రీధర్, పిన్నింటి ఉమారాణి, బుగ్గ వెంకటేశం, పాశం స్వామి, కోమటిరెడ్డి అనంతరెడ్డి, కళ్లెం సుదర్శన్ రెడ్డి, పల్సం భాస్కర్, దయ్యాల శ్రీశైలం, బొబ్బల మాధవరెడ్డి, కోమటిరెడ్డి ప్రవీణ్ రెడ్డి, బుగ్గ మనోజ్, ఎడ్ల మల్లారెడ్డి, పర్వతం రాజు, బుగ్గ అశోక్, కొలను రాంరెడ్డి, నక్కల నరేందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



## ఘనంగా బాలాజీ ఎంపోరియం ప్రారంభోత్సవం



- ఎంపోరియంను ప్రారంభించిన కౌన్సిలర్ బత్తుల వాణి విప్లవ్ గౌడ్



**చౌటుప్పల్, ఫిబ్రవరి 26 (తొలివెలుగు):** చౌటుప్పల్ మున్సిపాలిటీ 13వ వార్డు వలిగొండ రోడ్డులో నూతనంగా ఏర్పాటు చేసిన బాలాజీ లేడీస్ ఎంపోరియం దుకాణాన్ని స్థానిక 13వ వార్డు కౌన్సిలర్ బత్తుల వాణి విప్లవ్ గౌడ్ గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా దుకాణ యజమానులకు శుభాకాంక్షలు తెలియజేసి, వ్యాపారం అభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు. స్థానికులకు నాణ్యమైన వస్త్రాలు, మహిళలకు అవసరమైన సామగ్రి అందుబాటులో ఉండేలా సేవలందించాలని సూచించారు. దుకాణ ప్రారంభోత్సవం అనంతరం షాపు యజమానులు కౌన్సిలర్ బత్తుల వాణి విప్లవ్ గౌడ్‌ను శాలువా, పూలమాలతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమానికి స్థానికులు, వ్యాపారవేత్తలు హాజరయ్యారు.

## వైభవంగా వేంకటేశ్వరుని పల్లకి సేవ



- మహా పూర్ణాహుతితో నేడు ముగియనున్న వార్షిక బ్రహ్మోత్సవాలు

**రాజపేట, ఫిబ్రవరి 26 (తొలివెలుగు):** రాజపేట మండలం రేణిగుంట రెవెన్యూ పరిధిలోని శ్రీగిరి సంకల్ప సిద్ధి శ్రీ వెంకటేశ్వర స్వామి దేవస్థానంలో నిర్వహిస్తున్న ద్వితీయ వార్షిక బ్రహ్మోత్సవాలలో భాగంగా గురువారం పల్లకి సేవ మహోత్సవం భక్తిశ్రద్ధలతో అంగరంగ వైభవంగా జరిగింది. శ్రీ వేంకటేశ్వర స్వామికు శ్రీ మహాలక్ష్మి గోదా సమేతంగా ప్రత్యేక పూజలు నిర్వహించి పల్లకిలో ఆలయ పరిసర ప్రాంతాల్లో ఊరేగింపుగా తీసుకెళ్లారు. స్వామివారి నామస్మరణతో ఆలయ ప్రాంగణం మార్మోగింది. భక్తులు భజనలు, సంకీర్తనలు ఆలపిస్తూ, నృత్యాలతో పరవశించగా కార్యక్రమం ఆధ్యాత్మిక వాతావరణంలో సాగింది. బ్రహ్మోత్సవాల 5వ రోజు సందర్భంగా ఉదయం సుప్రభాత సేవతో కార్యక్రమాలు ప్రారంభమయ్యాయి. ఆరాధన సేవ, నివేదన, తీర్థప్రసాద గోష్టి, శాంతిపాఠం, చతుస్థానార్చన, మూలమంత్ర హోమాలు, శ్రీ లక్ష్మీనారాయణ ఇష్టి, పంచసూక్త హవనం, నిత్య పూర్ణాహుతి, బలిహరణ, శ్రీ విష్ణు సహస్రనామ స్తోత్ర పారాయణం తదితర కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయ ట్రస్ట్ సభ్యులు వట్టం రాఘవేందర్ గుప్త, కూర బద్రీనాథ్ గుప్త, సూది రెడ్డి నాగిరెడ్డి, సమ్మెట శ్రీనివాసరావు, ఎల్లారెడ్డి కుటుంబ సభ్యులు పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. శుక్రవారం మహా పూర్ణాహుతి, శ్రీ పుష్పయాగంతో ద్వితీయ వార్షిక బ్రహ్మోత్సవాలు ముగియనున్నట్లు ట్రస్ట్ సభ్యులు తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారి ఆశీస్సులు పొందాలని కోరారు. ఆలయ పరిసరాలను విద్యుత్ దీపాలు, పచ్చని తోరణాలు, పూలమాలలతో శోభాయమానంగా అలంకరించారు.



## ఆలయ నిర్మాణానికి 'కంచి' దాతృత్వం

- సీతారామయ్య సన్నిధిలో బోరు బావి ఏర్పాటు

**వలిగొండ, ఫిబ్రవరి 26 (తొలివెలుగు):** యాదాద్రి భువనగిరి జిల్లా వలిగొండ మండలం పులిగిల్ల గ్రామంలో నూతనంగా నిర్మించనున్న శ్రీ సీతారామచంద్రస్వామి దేవాలయం గుడి నిర్మాణానికి గ్రామ నాయకుడు కంచి బిందు రాములు తన వంతు సహాయంగా బోరు వేయించారు. గుడి నిర్మాణ పనులకు నీటి అవసరం దృష్ట్యా వేయించిన ఈ బోరులో పుష్కలంగా నీరు లభించడం గ్రామస్తుల్లో ఆనందాన్ని కలిగించింది. ఈ సందర్భంగా కంచి బిందు రాములు మాట్లాడుతూ.. సీతారామచంద్రస్వామి కరుణాకటాక్షాలతో గ్రామ ప్రజలు ఎల్లప్పుడూ సుఖసంతోషాలతో, సుభిక్షంగా ఉండాలని ఆకాంక్షించారు. ఆలయ నిర్మాణానికి ప్రతి ఒక్కరూ తమ వంతు సహకారం అందించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో కోమటిరెడ్డి ప్రవీణ్ రెడ్డి, బుగ్గ మనోజ్, ఈదుల నరేష్, బుగ్గ శ్రీనివాస్, రామలింగం, బుగ్గ నాగేందర్, పచ్చిమట్ల ముఖేష్, బుగ్గ శివ, వడ్లకొండ శివకుమార్, మేకల శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

## జిల్లా కలెక్టర్‌కు నాయకుల శుభాకాంక్షలు

- నూతన కలెక్టర్‌ను కలిసిన రాజాపేట కాంగ్రెస్ నాయకులు

**రాజపేట, ఫిబ్రవరి 26 (తొలివెలుగు):** రాజపేట మండల కాంగ్రెస్ సీనియర్ నాయకులు నూతనంగా యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్‌గా విధుల్లో చేరిన అనురాగ్ జయంతిను గురువారం మర్యాదపూర్వకంగా కలసి సత్కరించారు. ఈ సందర్భంగా యాదగిరిగుట్ట శ్రీ లక్ష్మీనరసింహస్వామి దేవస్థానం శేషవస్త్రంతో కలెక్టర్‌ను సత్కరించి అభినందనలు తెలిపారు. జిల్లా అభివృద్ధి, ప్రజా సమస్యల పరిష్కారంలో సమన్వయంతో పని చేయాలని కోరారు. కార్యక్రమంలో కిసాన్ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బుడిగే పెంటయ్య గౌడ్, సోషల్ మీడియా కన్వీనర్ ఇంజ నరేష్ తదితరులు పాల్గొన్నారు.



జాతీయ దిన పత్రిక
తొలివెలుగు
మన భాష.. మన పత్రిక..




## అట్టడుగు వర్గాల సంక్షేమమే లక్ష్యం: కలెక్టర్ అనురాగ్ జయంతి

**యాదాద్రి జిల్లా నూతన కలెక్టర్‌గా అనురాగ్ జయంతి బాధ్యతల స్వీకారం**

**యాదాద్రి భువనగిరి, ఫిబ్రవరి 26 (తొలివెలుగు):** అనురాగ్ జయంతిను యాదాద్రి భువనగిరి జిల్లా నూతన కలెక్టర్‌గా నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. బదిలీపై జిల్లా కలెక్టర్‌గా బాధ్యతలు చేపట్టారు. 2015 ఐఏఎస్ బ్యాచ్‌కు చెందిన అనురాగ్ జయంతి గతంలో భోధన్, ఖమ్మం జిల్లాల్లో సబ్ కలెక్టర్‌గా సేవలందించారు. అనంతరం రాజన్న సిరిసిల్ల జిల్లా కలెక్టర్‌గా పనిచేశారు. అలాగే గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో ఖైరతాబాద్ జోనల్ కమిషనర్‌గా, ప్రస్తుతం రాజేంద్రనగర్ జోన్ కమిషనర్‌గా విధులు నిర్వర్తించారు. జిల్లా కలెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించిన అనంతరం అనురాగ్ జయంతి మాట్లాడుతూ.. విద్యా, వైద్య రంగాలతో పాటు అభివృద్ధి మరియు సంక్షేమ పథకాల ఫలాలు అట్టడుగు వర్గాల ప్రజలకు చేరేలా కృషి చేస్తామని తెలిపారు. సమగ్ర అభివృద్ధి దిశగా జిల్లా ముందుకు సాగేందుకు అన్ని శాఖల సమన్వయంతో పని చేస్తామని పేర్కొన్నారు.

## కొలువుదీరిన కొత్త ఏడీసీ.. బాధ్యతలు చేపట్టిన వెంకారెడ్డి

**- నూతన రెవెన్యూ అదనపు కలెక్టర్‌గా వెంకారెడ్డి బాధ్యతలు స్వీకారం**



**యాదాద్రి భువనగిరి, ఫిబ్రవరి 26 (తొలివెలుగు):** యాదాద్రి భువనగిరి జిల్లాలో నూతన రెవెన్యూ అదనపు కలెక్టర్‌గా వెంకారెడ్డి తన పదవి బాధ్యతలను స్వీకరించారు. జిల్లా కలెక్టరేట్‌లోని తన ఛాంబర్‌లో బాధ్యతలు చేపట్టిన అనంతరం అధికారులతో సమావేశమయ్యారు. గతంలో శేరిలింగంపల్లిలో డిప్యూటీ కలెక్టర్, తహసిల్దార్‌గా పనిచేసిన వెంకారెడ్డి బదిలీపై యాదాద్రి భువనగిరి జిల్లాకు నియమితులయ్యారు. పరిపాలనా అనుభవంతో జిల్లాలో రెవెన్యూ శాఖ పనితీరును మరింత సమర్థవంతంగా నిర్వహించేందుకు కృషి చేస్తానని తెలిపారు. రెవెన్యూ సంబంధిత సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యత ఇచ్చి, ప్రజలకు పారదర్శక సేవలు అందించే దిశగా చర్యలు తీసుకుంటానని పేర్కొన్నారు.

## ప్రాజెక్టుల సాధన కోసం ప్రజా పోరాటాలకు సిద్ధం

**- పెండింగ్ ప్రాజెక్టులను త్వరగా పూర్తి చేసి రైతాంగానికి సాగునీరు అందించాలి**

**- సీపీఐ జాతీయ కార్యదర్శి పల్లా వెంకట్ రెడ్డి**

**చౌటుప్పల్, ఫిబ్రవరి 26 (తొలివెలుగు):** ఉమ్మడి నల్లగొండ జిల్లాలో పెండింగ్‌లో ఉన్న ఎఫ్‌సీ చర్లగూడెం రిజర్వాయర్‌ను త్వరితగతిన పూర్తి చేసి రైతులకు సాగునీరు అందించాలని పల్లా వెంకట్ రెడ్డి డిమాండ్ చేశారు. చౌటుప్పల్‌లో ఓ శుభకార్యానికి హాజరైన సందర్భంగా ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యంతో కలిసి విలేకరులతో మాట్లాడుతూ.. ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. డిండి ప్రాజెక్టులో భాగంగా నిర్మించ తలపెట్టిన చర్లగూడెం రిజర్వాయర్ పూర్తయితే వేలాది ఎకరాల భూములు సస్యశ్యామలం అవుతాయని తెలిపారు. రాచకొండలో ఎత్తిపోతల పథకం ఏర్పాటు ద్వారా నారాయణపురం, చౌటుప్పల్ మండలాలకు చెందిన అనేక గ్రామాలకు సాగునీరు అందించవచ్చని పేర్కొన్నారు. భూగర్భ జలాలు పెరిగి దీర్ఘకాలిక ప్రయోజనాలు కలుగుతాయని అన్నారు. ఫ్లోరిన్ ప్రభావిత ప్రాంతాలైన మునుగోడు, దేవరకొండ నియోజకవర్గాలకు సాగు, త్రాగునీటిని కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. ఎన్నో ఏళ్లుగా ప్రజలు ఉద్యమాలు నిర్వహిస్తున్నప్పటికీ ప్రభుత్వాలు నామమాత్రపు నిధులు మాత్రమే కేటాయిస్తున్నాయని విమర్శించారు. వచ్చే బడ్జెట్‌లో ప్రాజెక్టులు పూర్తయ్యేలా సరిపడా నిధులు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం, ఉమ్మడి జిల్లా మంత్రులు పెండింగ్ ప్రాజెక్టుల పూర్తి కోసం ప్రత్యేక చొరవ చూపాలని కోరారు. గతంలో సీపీఐ ఆధ్వర్యంలో పెద్దఎత్తున పోరాటాలు నిర్వహించామని, అవసరమైతే మళ్లీ ప్రజా పోరాటాలకు వెనుకాడబోమని హెచ్చరించారు. ఉమ్మడి నల్లగొండ జిల్లాకు సాగునీరు అందే వరకు విడతల వారీగా పోరాటాలు కొనసాగిస్తామని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో సీపీఐ జిల్లా కార్యదర్శి యానాల దామోదర్ రెడ్డి, టీఎస్‌పీఎన్‌ఎం రాష్ట్ర అధ్యక్షుడు కురిమిద్దె శ్రీనివాస్, సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు పల్లె శేఖర్ రెడ్డి, పగిల్ల మోహన్ రెడ్డి, ఉడుత రామలింగం, పొట్ట శంకరయ్య, రొండి నర్సింహా, టంగుటూరి రాములు, భాస్కర్, దాసరి మనోహర్, బోయ మంకులు తదితరులు పాల్గొన్నారు.



## కీలక ఖనిజరంగంలో భారత్ స్వయం సమృద్ధి సాధించడమే లక్ష్యం




**హైదరాబాద్ (తొలివెలుగు):** నేటి ఆధునిక ప్రపంచంలో కీలక ఖనిజాలకు అత్యంత ప్రాధాన్యత ఉందని, ఈ రంగంలో భారత్‌ను స్వయం సమృద్ధి దేశంగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వ, ప్రైవేటు సంస్థలు సమన్వయంతో ముందుకు సాగాల్సిన అవసరం ఉందని కేంద్ర నీతి ఆయోగ్ ఏర్పాటు చేసిన నేషనల్ క్రిటికల్ మినరల్ మిషన్ కమిటీ అభిప్రాయపడింది. హైదరాబాద్‌లోని సింగరేణి భవన్‌లో గురువారం కమిటీ ఛైర్మన్ డా. డీకే సింగ్ అధ్యక్షతన జరిగిన సమీక్షా సమావేశంలో దేశంలో కీలక ఖనిజాల అవసరం, లభ్యత, అన్వేషణ అవకాశాలు, ప్రభుత్వ మైనింగ్ సంస్థలు తీసుకోవాల్సిన చొరవ, బాధ్యతలపై లోతైన చర్చ జరిగింది. ఈ సమావేశంలో కమిటీ మెంబర్ సెక్రటరీ, నీతి ఆయోగ్ డిప్యూటీ అడ్వైజర్ (మినరల్స్) ఆర్. శరవణభవన్‌తో పాటు సభ్యులుగా ఉన్న ది సింగరేణి కాలరీస్ కంపెనీ లిమిటెడ్ సీఎండీ డా. బుద్ధప్రకాశ్ జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

కేంద్ర నీతి ఆయోగ్ ఏర్పాటు చేసిన ఈ కమిటీలో సింగరేణి సీఎండీ సభ్యుడిగా ఉండటంతో, ఈ సమావేశాన్ని సింగరేణి ఆతిథ్యంలో నిర్వహించారు. సమావేశానికి స్వాగతం పలికిన సింగరేణి సీఎండీ డా. బుద్ధప్రకాశ్ జ్యోతి మాట్లాడుతూ, దేశంలోని ప్రాథమిక మరియు ద్వితీయ కీలక ఖనిజ వనరులను గుర్తించి వినియోగంలోకి తేవడానికి ఏర్పాటు చేసిన ఈ కమిటీ దేశ అవసరాలను తీర్చడంలో కీలక పాత్ర పోషిస్తుందని అన్నారు. ఈ దిశగా సింగరేణి సంస్థ తన సంపూర్ణ సహకారం అందిస్తుందని స్పష్టం చేశారు. సింగరేణి ఓపెన్‌కాస్ట్ గనుల ఓవర్‌బర్డెన్ మట్టి, సింగరేణి థర్మల్ విద్యుత్ కేంద్రం నుంచి వెలువడే ఫ్లై యాష్, బాటమ్ యాష్‌లలో దాగి ఉన్న క్రిటికల్ మినరల్స్‌ను వెలికితీయడానికి కృషి చేస్తామని, జాతీయ కీలక ఖనిజ అవసరాల సాధనలో సింగరేణి తన బాధ్యతను నిర్వర్తిస్తుందని ఆయన తెలిపారు. ఈ సందర్భంగా కమిటీ సభ్యులు మాట్లాడుతూ, సోలార్ విద్యుత్, బ్యాటరీ ఆధారిత వాహనాలు, ఎలక్ట్రానిక్స్ విస్తరణ, రక్షణ రంగాల్లో కీలక ఖనిజాల అవసరం వేగంగా పెరుగుతోందని తెలిపారు. దేశంలో వనరులు ఉన్నప్పటికీ మైనింగ్ పరిమితంగా ఉండటంతో ప్రస్తుతం విదేశాల నుంచి దిగుమతులపై ఆధారపడాల్సి వస్తోందని పేర్కొన్నారు. రానున్న కాలంలో వినియోగం మరింత పెరగనున్న నేపథ్యంలో ప్రభుత్వప్రైవేటు మైనింగ్ సంస్థలు కలిసి పనిచేయాలని సూచించారు. ఈ సమావేశంలో సింగరేణి సంస్థ నుంచి డైరెక్టర్ (ప్రాజెక్ట్స్ అండ్ ప్లానింగ్) కె. వెంకటేశ్వర్లు, జీఎం (కో-ఆర్డినేషన్, మార్కెటింగ్) టి. శ్రీనివాస్, జీఎం (ఎక్స్‌ప్లోరేషన్) బి. శ్రీనివాసరావు పాల్గొన్నారు. అదనంగా ఐఎంఎంటీ, కోల్ ఇండియా, సీఎస్ఐఆర్‌సీఈసీఆర్ఐ (కరైకుడి), గుజరాత్ మినరల్ డెవలప్మెంట్ కార్పొరేషన్, అదానీ, వేదాంత, లాయిడ్ మెటల్స్, హిందాల్కో, హిందుస్తాన్ జింక్, సన్ టెక్నాలజీస్ (చెన్నై) తదితర సంస్థల ప్రతినిధులు హాజరయ్యారు.






## గుట్ట బ్రహ్మోత్సవాల్లో రఘునాథపురం భక్త బృందం భజనలు



**రాజపేట, ఫిబ్రవరి 26 (తొలివెలుగు):** రాజపేట మండలం రఘునాథపురం గ్రామానికి చెందిన శ్రీ వెంకటేశ్వర భజన మండలి సభ్యులు యాదగిరిగుట్ట శ్రీ లక్ష్మీనరసింహస్వామి దేవస్థానంలో జరుగుతున్న వార్షిక బ్రహ్మోత్సవాలలో భాగంగా ధార్మిక సాహిత్య సంగీత సభల్లో పాల్గొన్నారు. కొండపైన స్వామివారి సన్నిధిలో ఏర్పాటు చేసిన ధార్మిక సాహిత్య సంగీత సభల మండపంలో గురువారం రఘునాథపురం శ్రీ వెంకటేశ్వర భజన మండలి భక్త బృందం ఆధ్వర్యంలో భజన కార్యక్రమాన్ని అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. స్వామివారి నామస్మరణతో ఆలయ ప్రాంగణం మార్మోగగా భక్తులు పరవశించారు. బ్రహ్మోత్సవాల సందర్భంగా ధార్మిక సంగీత సభలో భజన కార్యక్రమం ప్రదర్శించినందుకు దేవస్థానం అధికారులు భజన మండలి సభ్యులను అభినందించి ప్రశంసా పత్రం, స్వామివారి మహా ప్రసాదాన్ని అందజేశారు. కార్యక్రమంలో భజన మండలి సభ్యులు బీతోజు వెంకటేశం, వల్లకాటి బాబురావు, పాశికంటి ఉపేందర్, కటకం సంతోష్, బింగి శివరాజ్, బెజగం ఆత్మలింగం, కటకం హరినాథ్, బింగి పాండురంగం, గుజ్జ రామచంద్రం, భీమనపల్లి రమేష్, కటకం నాగేష్, సామల భాస్కర్, వెంగల్ దాస్ నగేష్, భోగ శ్రీనివాస్, రేగొండ వెంకటేశం, ఆడెపు బాబు, కటకం గణేష్, బిజ్జాల ఈశ్వర్, లోక మల్లేశం, గొట్టిపాముల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## ఆరోగ్యమే మహాభాగ్యం.. నేత్ర రక్షణే లక్ష్యం

**- ట్రాఫిక్ సీఐ విజయ్ మోహన్**




**చౌటుప్పల్, ఫిబ్రవరి 26 (తొలివెలుగు):** మానవ శరీరంలో అత్యంత విలువైన నేత్రాలను కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని ట్రాఫిక్ సీఐ విజయ్ మోహన్ అన్నారు. గురువారం వలిగొండ రోడ్డులోని లయన్స్ భవనంలో లయన్స్ క్లబ్ ఆఫ్ సేవ ఆధ్వర్యంలో పోలీసు సిబ్బందికి, స్థానికులకు ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరాన్ని ప్రారంభించిన అనంతరం ఆయన మాట్లాడుతూ.. స్పష్టమైన దృష్టి లేకపోతే నిత్య జీవితంతో పాటు విధుల్లోనూ ఇబ్బందులు ఎదురవుతాయని పేర్కొన్నారు. కంటి నిపుణులు గుంటోజు సంధ్యారాణి పర్యవేక్షణలో పోలీసులకు పరీక్షలు జరిపి, తగు సూచనలు చేశారు. పట్టణ ప్రజలకు మధుమేహం, రక్తపోటు పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో కార్యదర్శి అతహర్ పాష, సభ్యులు కాసుల వెంకటేశం, కటికం ప్రశాంత్, కొసనం రామిరెడ్డి, పట్టణ ట్రాఫిక్ పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



## మెరుపు తనిఖీలు.. నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తప్పవు:

**అదనపు కలెక్టర్ భాస్కర్ రావు**

**యాదాద్రి భువనగిరి, ఫిబ్రవరి 26 (తొలివెలుగు):** భువనగిరి పట్టణంలోని ఇంటర్మీడియట్ పరీక్షా కేంద్రాలను స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ భాస్కర్ రావు గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. టైమ్స్ జూనియర్ కాలేజ్, శ్రీ చైతన్య జూనియర్ కాలేజ్ లలో నిర్వహిస్తున్న ఇంటర్మీడియట్ వార్షిక పరీక్షల నిర్వహణ తీరును పరిశీలించారు. పరీక్షలు ప్రశాంత వాతావరణంలో జరుగుతున్నాయా, విద్యార్థులకు కల్పించిన సౌకర్యాలు సక్రమంగా ఉన్నాయా అనే అంశాలపై సమీక్ష నిర్వహించారు. ప్రశ్నాపత్రాల పంపిణీ విధానం, భద్రతా ఏర్పాట్లు, పరీక్షా నిర్వహణలో పాటిస్తున్న నియమావళిని పరిశీలించారు. కేంద్రాల్లో అమర్చిన సీసీ కెమెరాల పనితీరు, తాగునీరు, విద్యుత్ సరఫరా, కూర్చునే ఏర్పాట్లపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఇన్విజిలేటర్లు విధి నిర్వహణలో అప్రమత్తంగా ఉండాలని, ఎలాంటి అక్రమాలు చోటుచేసుకోకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని సూచించారు. విద్యార్థులు ఒత్తిడికి లోనుకాకుండా ప్రశాంతంగా పరీక్షలు రాసేందుకు అనుకూల వాతావరణం కల్పించాలని ఆదేశించారు. ఈ తనిఖీలో కళాశాల సిబ్బంది, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## విద్యావంతులు, నైతిక నాయకులు రాజకీయాల్లోకి రావాలి

భారతదేశం ఒక గొప్ప ప్రజాస్వామ్య దేశం. ప్రజల చేత ఎన్నుకోబడే ప్రభుత్వం ప్రజల ఆకాంక్షలను నెరవేర్చాలి. అయితే ప్రస్తుతం రాజకీయాల్లో డబ్బు, మద్యం, అవినీతి ప్రభావం పెరుగుతోందని రాష్ట్ర వనరుల వ్యక్తి కృష్ణ రాంటేకి ఆందోళన వ్యక్తం చేశారు. విద్యావంతులు, నైతికంగా నిజాయితీ గల వ్యక్తులు రాజకీయాల్లోకి రావాల్సిన అవసరం ఉందని ఆయన పేర్కొన్నారు. ˊమాజ సేవే లక్ష్యంగా రాజకీయాల్లోకి అడుగుపెట్టే నాయకులు ప్రజా సమస్యలను సమర్థంగా అర్థం చేసుకొని పరిష్కార మార్గాలను చూపగలరు. నిజాయితీ, పారదర్శకత వంటి విలువలను కాపాడుతూ ప్రభుత్వాన్ని మరింత జవాబుదారీగా మార్చగలరు. సామాజిక అభివృద్ధి, సంక్షేమ పథకాల సమర్థ అమలు, అవినీతి నిర్మూలన వంటి అంశాల్లో వారు కీలక పాత్ర పోషిస్తారని కృష్ణ రాంటేకి అభిప్రాయపడ్డారు.

తొలివెలుగు
జాతీయ దిన పత్రిక
మన భాష.. మన పత్రిక..





## కవాసాకి నయా బైకు.. ప్రారంభ ధర రూ 8.63 లక్షలు


న్యూఢిల్లీ, డిసెంబర్ 27: ప్రముఖ ద్విచక్ర వాహన సంస్థ కవాసాకి మరో మోటర్‌సైకిల్‌ను దేశీయ మార్కెట్‌కు పరిచయం చేసింది. 2026 వెర్షన్‌గా విడుదల చేసిన ఈ వర్సెస్ 650 బైకు ధరను రూ.8.63 లక్షలుగా నిర్ణయించింది. 649 సీసీ ఇంజిన్ సామర్థ్యంతో రూపొందించిన ఈ బైకులో లిక్విడ్-కూల్డ్ ట్విని-సిలిండర్ ఇంజిన్‌తో తీర్చిదిద్దిన ఈ బైకు రెండు రంగుల్లో ళంచనున్నది. 66 బీహెచ్‌పీ శక్తినివ్వనున్న ఈ బైకులో ఆరు గేర్లు, డ్యూయల్ 300 ఎంఎం డిస్క్ బ్రేక్, 4.3 ఇంచుల డిజిటల్ ఇన్‌స్ట్రుమెంట్‌తో స్మార్ట్‌ఫోన్‌తో కనెక్టింగ్ చేసుకోవచ్చును, యూఎస్‌బీ చార్జింగ్ పాయింట్, ఏబీఎస్, అలాగే విండ్‌స్క్రీన్‌ను ఎటైనా కదిలించుకునే విధంగా డిజైన్ చేసింది.

## ఐపీవోకి జెప్టో




న్యూఢిల్లీ: క్విక్ కామర్స్ సేవల సంస్థ జెప్టో..స్టాక్ మార్కెట్లోకి అడుగుపెట్టడానికి సిద్ధమవుతున్నది. ఇందుకు సంబంధించి స్టాక్ మార్కెట్ నియంత్రణ మండలి సెబీకి దరఖాస్తు చేసుకున్నది. వాటాల విక్రయం ద్వారా గరిష్ఠంగా రూ.11 వేల కోట్ల నిధులను సమీకరించాలని యోచిస్తున్నది. వచ్చే ఏడాది మార్కెట్లో లిస్ట్ కానున్న అతి పిన్న వయస్సు కలిగిన స్టార్టప్‌లలో ఇది కూడా ఒకటికానున్నది. ఇప్పటికే మార్కెట్లోకి అడుగుపెట్టిన జోమాటో, స్విగ్గీలకు పోటీగా జెప్టో..ఐపీవోకి రాబోతున్నది. 7 బిలియన్ డాలర్ల విలువ కలిగిన జెప్టో..ఈ ఐపీవో ద్వారా 1.8 బిలియన్ డాలర్లు లేదా రూ.16 వేల కోట్ల నిధులు సమీకరించాలని యోచిస్తున్నది. ఈ అక్టోబర్ నెలలో సంస్థ రూ.3,757 కోట్ల నిధులను సమీకరించింది.

## ఒక్కరోజే రూ.11 వేలు పెరిగిన కిలో వెండి ధర.. లక్షన్నరకు చేరువలో బంగారం




బంగారం ధరలు ఆకాశాన్ని అంటుతున్నాయి. వరుసగా రెండో రోజైన శనివారం మరో ఆల్‌టైం హైకి చేరుకున్నాయి. ముఖ్యంగా వెండి ధరలు రాకెట్ వేగంతో దూసుకెళ్తున్నాయి. ఇవాళ ఒక్కరోజే కేజీ వెండిపై రూ.11 వేలు పెరిగి రెండున్నర లక్షలు దాటింది. శనివారం ఉదయం హైదరాబాద్ బులియన్ మార్కెట్‌లో కిలో వెండి ధర రూ.2.51 లక్షలకు చేరింది. అటు బంగారం ధరలు కూడా పెరిగాయి. ఇవాళ హైదరాబాద్ మార్కెట్‌లో 24 క్యారెట్ల పది గ్రాముల స్వచ్ఛమైన బంగారం ధర రూ.1,43,000 పలుకుతోంది. 22 క్యారెట్ల పది గ్రాముల బంగారం ధర రూ.1,32,410కి చేరింది. ప్రధానంగా అంతర్జాతీయ మార్కెట్లో డిమాండ్ నెలకొనడంతో ధరలు భారీగా పుంజుకుంటున్నాయని ఆల్ ఇండియా సరఫా అసోసియేషన్ వెల్లడించింది. ఈ ఏడాది ఇప్పటి వరకు తులం బంగారం రూ.63,350 లేదా 80.24 శాతం పెరిగింది. డిసెంబర్ 31, 2024న ధర రూ.78,950గా ఉన్నది. అంతర్జాతీయ మార్కెట్లో ఔన్స్ గోల్డ్ ధర 50.87 డాలర్లు లేదా 1.13 శాతం ఎగబాకి 4,530.42 డాలర్లు పలికింది. ఫెడరల్ రిజర్వు వడ్డీరేట్లను తగ్గించే అవకాశాలుండటంతో మదుపరులు తమ పెట్టుబడులను సురక్షితమైన అతి విలువైన లోహాలవైపు మళ్లించడంతో వీటి ధరలు దూసుకుపోతున్నాయని

# వెండి ఏ 2.52 లక్షలు.. రికార్డు స్థాయిలో


# దూసుకుపోయిన కిలో ధర

### ఒక్కరోజే దాదాపు రూ 20 వేలు పెరిగిన విలువ




హైదరాబాద్, డిసెంబర్ 27: వెండి వెలుగులు చిమ్ముతున్నది. ఇప్పటికే సామాన్యుడికి అందనంత దూరానికి చేరుకున్న వెండి మరో శిఖరాన్ని అధిగమించింది. రోజుకొక గరిష్ఠ స్థాయికి చేరుకుంటున్న అతి విలువైన లోహాల ధరలు శనివారం రికార్డు స్థాయిలో దూసుకుపోయాయి. హైదరాబాద్ బులియన్ మార్కెట్లో పసిడి, వెండి పరుగులు పెట్టింది. కిలో వెండి దాదాపు రూ.20 వేల వరకు అధికమై రూ.2.52 లక్షలు దాటింది. వెండి చరిత్రలో ఈ మైలురాయికి చేరుకోవడం ఇదే తొలిసారి. ఈవారంలోనే ఏకంగా రూ.35 వేల వరకు పెరిగినట్టు అయింది. అటు బంగారం కూడా మరో ఉన్నత శిఖరాలకు చేరుకున్నది. 99.9 శాతం స్వచ్ఛత కలిగిన పదిగ్రాముల గోల్డ్ ధర రూ.1,44,500 పలికింది. రిటైల్ మార్కెట్లో దూసుకుపోయిన అతివిలువైన లోహాల ధరలు ఇటు ఫ్యూచర్ మార్కెట్లోనూ రికార్డు స్థాయిలో పలికింది. ఈ వారంలో వెండి ధర 15 శాతం ఎగబాకి రూ.2.42 లక్షలకు చేరుకున్నది. పారిశ్రామిక వర్గాల నుంచి డిమాండ్ అధికంగా ఉండటం వల్లనే ధరలు పుంజుకుంటున్నాయని తెలిపింది. ఎంసీఎక్స్ మార్కెట్లో వెండి వరుసగా ఐదు రోజులుగా పెరుగుతూనే ఉన్నది.వచ్చే ఏడాది మార్చి నెల డెలివరీకిగాను కిలో వెండి రూ.18,210 లేదా 8 శాతం అందుకొని రూ.2.42 లక్షలకు చేరుకోనున్నది. శుక్రవారం గ్లోబల్ మార్కెట్లో ఔన్స్ గోల్డ్ ధర 50 డాలర్లు లేదా 1 శాతం ఎగబాకి 4,553 డాలర్లు పలికింది. అలాగే ఔన్స్ వెండి 5.51 డాలర్లు లేదా 8 శాతం అందుకొని 79.70 డాలర్లకు చేరుకున్నది. వచ్చే ఏడాది ఔన్స్ వెండి ధర 100 డాలర్లకు చేరుకునే అవకాశాలున్నాయని ఇండస్ట్రీ వర్గాలు అంచనావేస్తున్నాయి. వచ్చే ఏడాది అమెరికా ఫెడరల్ రిజర్వు వడ్డీరేట్లు తగ్గించే అవకాశం దేశీయ పారిశ్రామిక వర్గాల నుంచి డిమాండ్ అధికంగా ఉండటం అంతర్జాతీయ పెట్టుబడిదారులు ఎగబడి కొనుగోళ్లు జరపడం

## నగరాల్లో రిటైల్ స్పేస్‌కు డిమాండ్




న్యూఢిల్లీ: దేశవ్యాప్తంగా టాప్%-%8 నగరాల్లోని షాపింగ్ మాల్స్‌లో రిటైల్ దుకాణ వసతులకు, ప్రధాన వీధుల్లోని రిటైల్ వసతులకు డిమాండ్ పెరుగుతున్నట్టు రియల్ ఎస్టేట్ కన్సల్టెన్సీ కుష్మన్ అండ్ వేక్‌ఫీల్డ్ సంస్థ తెలిపింది. ఈ ఏడాది డిమాండ్ 15 శాతం పెరిగి 9 మిలియన్ చదరపు అడుగులకు (ఎస్‌ఎఫ్‌టీ) లీజింగ్ చేరుకోవచ్చని అంచనా వెల్లడించింది. రిటైలర్ల నుంచి పెరుగుతున్న డిమాండ్‌కు అనుగుణంగా సరఫరా పెరగనున్నట్టు తెలిపింది. 2024లో ఇవే నగరాల్లో రిటైల్ వసతుల లీజింగ్ 7.8 మిలియన్ ఎస్‌ఎఫ్‌టీగా ఉన్నట్టు పేర్కొంది. ఈ మేరకు ఒక నివేదికను విడుదల చేసింది. హైదరాబాద్‌తోపాటు చెన్నై, బెంగళూరు, పుణె, ముంబై, ఢిల్లీ%-%ఎన్‌సీఆర్, కోల్‌కతా, అహ్మదాబాద్ నగరాల డేటా ఇందులో ఉంది.

**ప్రముఖ ప్రాంతాల్లో ఇలా..**

టాప్%-%8 నగరాల్లోని ప్రముఖ వాణిజ్య ప్రాంతాల్లో (హై స్ట్రీట్ లొకేషన్లు) ఈ ఏడాది రిటైల్ వసతుల లీజింగ్ 5.4 మిలియన్ ఎస్‌ఎఫ్‌టీగా ఉండొచ్చన్నది కుష్మన్ అండ్ వేక్‌ఫీల్డ్ అంచనా. 2024లో ఇది 5.3 మిలియన్ ఎస్‌ఎఫ్‌టీగా ఉంది. ఇక షాపింగ్ మాల్స్‌లోని రిటైల్ దుకాణాల లీజింగ్ పరిమాణం 3.8 మిలియన్ ఎస్‌ఎఫ్‌టీకి చేరుకోవచ్చని తెలిపింది. 2023లో ఇది 2.5 మిలియన్ ఎస్‌ఎఫ్‌టీగా ఉంది. 2020లో కరోనా విపత్తు అనంతరం ఒక ఏడాదిలో రిటైల్ వసతుల అధిక లీజింగ్ ఈ ఏడాదే నమోదు కానున్నట్టు, క్యూ4లో (అక్టోబర్%-%డిసెంబర్) కొత్త మాల్స్ అందుబాటులోకి రానున్నట్టు కుష్మన్ అండ్ వేక్‌ఫీల్డ్ ఈడీ గౌతమ్ సరాఫ్ తెలిపారు. వచ్చే ఏడాది కూడా రిటైల్ వసతుల సరఫరా (కొత్తవి ప్రారంభం) మెరుగ్గా ఉంటుందని చెప్పారు.

కస్టమర్లు భౌతికంగా చూసి, కొనుగోలుకు ప్రాధాన్యం ఇస్తుండడంతో, ప్రీమియమైజేషన్‌కు అనుగుణంగా రిటైల్ వసతుల విస్తరణ చోటుచేసుకుంటున్నట్టు తెలిపారు. ఈ ఏడాది కొత్త గ్రేడ్%-%ఏ మాల్స్ పూర్తి 0.9 మిలియన్ ఎస్‌ఎఫ్‌టీకి పరిమితం కావొచ్చని, 2025లో కొత్త డెలివరీలు 4.3 మిలియన్ ఎస్‌ఎఫ్‌టీగా ఉండొచ్చని ఈ నివేదిక వెల్లడించింది. మారుతున్న జీవనశైలులు, వినియోగదారుల ప్రాధాన్యతలతో రిటైల్ వసతులకు డిమాండ్ బలంగా కొనసాగుతున్నట్టు భారతి రియల్ ఎస్టేట్ ఎండీ, సీఈవో ఎస్‌కే సన్యాల్ తెలిపారు. పట్టణాల్లో అనుసంధానత రిటైల్ వసతుల డిమాండ్‌లో కీలక పాత్ర పోషిస్తున్నట్టు చెప్పారు.

## కారు మైలేజ్ పెరగాలంటే..

ఇంధన ధరలు రోజు రోజుకు పెరుగుతున్న సమయంలో.. చాలామంది కార్ల కొనుగోలుదారులు ఎక్కువ మైలేజ్ ఇచ్చే కార్లనే కొనుగోలు చేస్తుంటారు. అయితే క్రమంగా కొన్ని రోజులకు మైలేజ్ కొంత తగ్గే అవకాశం ఉంటుంది. ఇలా కాకుండా.. మైలేజ్ పెరగాలంటే వాహనదారులు ఏం చేయాలో ఇక్కడ తెలుసుకుందాం.

**సరైన డ్రైవింగ్**

కారు మైలేజ్‌పై ఎక్కువ ప్రభావం చూపేది డ్రైవింగ్ విధానమే. ఆకాశమత్తుగా వేగం పెంచడం, సడన్ బ్రేక్స్ వేయడం వల్ల ఇంధనం ఎక్కువగా ఖర్చవుతుంది. కాబట్టి స్మూత్‌గా.. ఒక నిర్దిష్టమైన వేగంతో డ్రైవ్ చేయాలి. సాధారణంగా గంటకు 60 కిమీ నుంచి 80 కిమీ వేగం ఉత్తమ మైలేజ్‌కు అనుకూలంగా ఉంటుంది. అంతే కాకుండా.. అవసరం లేనప్పుడు క్లచ్ నొక్కి ఉంచకుండా, సరైన గేర్‌ను ఉపయోగించాలి.

**వాహనాన్ని సక్రమంగా నిర్వహించడం**

వాహనాన్ని ఉపయోగించడం మాత్రమే కాకుండా.. మెయింటెనెన్స్ కూడా సరిగ్గా చేస్తుండాలి. ఇది నిర్లక్ష్యం చేస్తే మైలేజ్ తప్పకుండా తగ్గుతుంది. టైర్ ప్రెషర్ సరిగా లేకపోతే ఇంజిన్‌పై ఎక్కువ భారం పడుతుంది. కాబట్టి కంపెనీ సూచించిన టైర్ ప్రెజర్ మెయింటెనెన్స్ చేయాలి. ఇంజిన్ ఆయిల్, ఎయిర్ ఫిల్టర్, ఫ్యూయల్ ఫిల్టర్ వంటి వాటిని సమయానికి మారుస్తుండాలి.

**అనవసర బరువు వేయొద్దు**

కారులో లోపల లేదా కారు డిక్కీలో అవసరం లేని లగేజ్ ఉంచకూడదు. బరువు పెరిగితే.. ఇంజిన్ పనితీరు ఎక్కువ ఉండాల్సి ఉంటుంది. దీనివల్ల ఇంధనం ఎక్కువ ఖర్చవుతుంది. కాబట్టి అవసరం లేని వస్తువులను తొలగించడం ద్వారా మైలేజ్ కొంత పెంచుకోవచ్చు.

**ఏసీ, ఎలక్ట్రిక్ పరికరాల వినియోయాగం**

కారులో అవసరం లేనప్పుడు ఏసీ ఆపేయాలి. ఏసీ వినియోగం కూడా ఇంధన వినియోగానికి కారణం అవుతుంది. ప్రత్యేకంగా నగరంలో తక్కువ వేగంతో డ్రైవ్ చేస్తున్నప్పుడు %ాజ% వాడకం

# ఎకానమీకి దేశీ డిమాండ్ దన్ను

### సమన్వయంతో కూడిన చర్యలు

### పటిష్టంగా భారత ఆర్థిక వ్యవస్థ

### ఆర్‌బీఐ బులెటిన్ వెల్లడి



ముంబై: సమన్వయంతో కూడిన ద్రవ్య, పరపతి- నియంత్రణ విధానాలు ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో ఆర్థిక వ్యవస్థ పనితీరు బలంగా కొనసాగడానికి సాయపడినట్టు ఆర్‌బీఐ తాజా బులెటిన్ పేర్కొంది. అయితే వెలుపలి రిస్కుల నుంచి దేశ ఆర్థిక వ్యవస్థకు పూర్తి రక్షణ లేకపోవడాన్ని గుర్తు చేసింది. స్థూల ఆర్థిక మూలాలు, ఆర్థిక సంస్కరణలపై ప్రత్యేక దృష్టి కొనసాగించడం సామర్థ్యాలు, ఉత్పాదకత పెంపునకు సాయం చేస్తుందని.. వేగంగా మారిపోతున్న అంతర్జాతీయ పరిస్థితుల్లోనూ భారత ఆర్థిక వ్యవస్థ బలంగా నిలబడేందుకు దారితీస్తుందని పేర్కొంది. 2025లో అంతర్జాతీయ వాణిజ్య విధానాల్లో టారిఫ్‌లతో నెలకొన్న అసాధారణ మార్పును ప్రస్తావించింది. అంతర్జాతీయ సరఫరా వ్యవస్థ, వాణిజ్యంపై ఈ ప్రభావం ఎంతమేర ఉంటుందన్న దానిపై స్పష్టత లేదంటూ.. అంతర్జాతీయ వృద్ధి అవకాశాలపై మాత్రం ప్రభావం ఉంటుందని పేర్కొంది.

**పటిష్టంగా దేశీ డిమాండ్**

దేశీయంగా బలమైన డిమాండ్ మద్దతుతో 2025%-%26లో క్యూ2లో (సెప్టెంబర్ త్రైమాసికం) భారత ఆర్థిక వ్యవస్థ వేగవంతమైన వృద్ధిని నమోదు చేసినట్టు ఆర్‌బీఐ బులెటిన్ తెలిపింది. నవంబర్ నెలకు సంబంధించి కీలక సంకేతాలు సైతం డిమాండ్ బలంగా ఉండడాన్ని సూచిస్తున్నట్టు పేర్కొంది. ద్రవ్యోల్బణం ఇప్పటికీ కనిష్ట స్థాయిలోనే కొనసాగుతుండడాన్ని గుర్తు చేసింది. 2025 ఏప్రిల్%-%అక్టోబర్ మధ్య విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులు (ఎఫ్‌డీఐ) గతేడాది ఇదే కాలంతో పోల్చితే అధికంగా ఉన్నట్టు తెలిపింది. విదేశీ పోర్ట్‌ఫోలియో పెట్టుబడులు (ఎఫ్‌పీఐ) మాత్రం ప్రతికూలంగా ఉన్నట్టు తెలిపింది. భారత్%-%యూఎస్ మధ్య వాణిజ్య ఒప్పందంపై అనిశ్చితులు, అధిక వ్యాల్యూయేషన్ల వద్ద ఎఫ్‌పీఐల అమ్మకాలు చేస్తున్నట్టు పేర్కొంది. ఇది రూపాయి విలువను సైతం ప్రభావితం చేస్తున్నట్టు తెలిపింది. రూపాయి పతనాన్ని అడ్డుకునేందుకు ఆర్‌బీఐ అక్టోబర్‌లో 11.87 బిలియన్ డాలర్లు వెచ్చించినట్టు వెల్లడించింది.

# త్రీడీలో చూసి షాక్ అయ్యాను

"కార్తికేయ 2' వంటి పాన్ ఇండియా విజయం తర్వాత అంతకంటే అద్భుతమైన ప్రాజెక్ట్‌తో రావాలని ఇన్ని రోజులు ఆగాను. అన్ని జాగ్రత్తలు తీసుకుంటూ చేసిన సినిమా 'స్వయంభు'. ఈ చిత్రం చూసిన తర్వాత నిఖిల్ మావాడు అని చెప్పడానికి మీరంతా చాలా సంతోషపడతారు" అని నిఖిల్ చె??పారు. నిఖిల్ హీరోగా, సంయుక్త, నభా నటేష్ హీరోయిన్లుగా నటించిన చిత్రం 'స్వయంభు'. భరత్ కృష్ణమాచారి దర్శకత్వంలో ఠాగూర్ మధు సమర్పణలో భువన్, శ్రీకర్ నిర్మించారు. ఈ చిత్రం తెలుగు, తమిళ, కన్నడ, మలయాళ, హిందీ, చైనీస్, స్పానిష్, అరబిక్ భాషల్లో త్వరలో రిలీజ్‌కు సిద్ధమవుతోంది. ఈ మూవీ టీజర్ లాంచ్ ఈవెంట్‌లో నిఖిల్ మాట్లాడుతూ-- "వెయ్యేళ్ల క్రితం రాయలసీమలోని చిత్తూరు ప్రాంతంలో కృష్ణ అనే యోధుడు ఉండేవారు. అల్లరిగా తిరిగే అండర్ డాగ్ రాజ్యాలను శాసించే స్థాయికి ఆయన ఎలా ఎదిగారు? అనేది మా సినిమాలో చూపించాం. ఈ మూవీని త్రీడీలో చూసినప్పుడు షాక్ అయ్యాను. ప్రేక్షకులు కూడా చాలా ఎంజాయ్ చేస్తారు" అని చె??పారు. భరత్ కృష్ణమాచారి మాట్లాడుతూ-- "ఈ సినిమా అందరికీ గొప్ప అనుభూతినిస్తుంది" అని పేర్కొన్నారు. "ఈ సినిమాలో భాగం కావడం చాలా గర్వంగా ఉంది" అన్నారు కెమెరామేన్ సెంథిల్ కుమార్.



# గ్లోబల్ స్టార్ కాబోతున్న ప్రియమణి!

టాలీవుడ్ నుంచి బాలీవుడ్ కు వెళ్లిన ప్రియమణి... పలు వెబ్ సిరీస్ లలో కూడా నటిస్తూ బిజీగా ఉంటోంది. ఇప్పుడు హాలీవుడ్ మూవీలో నటించేందుకు సిద్ధమవుతోంది. ఇండో-అమెరికన్ చిత్రంలో ప్రియమణి ప్రధాన పాత్రకు ఎంపికయింది. బాలీవుడ్ నటుడు మోహిత్ రైనాతో కలిసి ఆమె ఈ అంతర్జాతీయ చిత్రంలో నటించబోతోంది. హర్ష్ మహదేశ్వర్ దర్శకత్వం వహించనున్న ఈ సినిమాను అమెరికాకు చెందిన రెడ్ బైసన్ ప్రొడక్షన్స్, ముంబైలోని అజూర్ ఎంటర్టైన్మెంట్ సంయుక్తంగా నిర్మించనున్నాయి. ఈ విషయాన్ని సోషల్ మీడియా వేదికగా నిర్మాణ సంస్థలు అధికారికంగా ప్రకటించాయి. భారతీయ, అమెరికా సంస్కృతుల కలయికతో, ఒక వలస కుటుంబం ఎదుర్కొనే భావోద్వేగపూరిత ప్రయాణమే ఈ సినిమా కథాంశం. హాలీవుడ్ సూపర్ హిట్ సినిమాలకు పనిచేసిన అగ్రశ్రేణి సాంకేతిక నిపుణులు ఈ ప్రాజెక్ట్ కోసం పనిచేస్తుండటం గమనార్హం. ఈ సినిమా షూటింగ్ ఏప్రిల్ లో ప్రారంభం కానుంది.



# ఫ్యాన్స్ ప్రేమ కొన్ని సార్లు ఇబ్బందిగా మారుతుంది ..

సినీ నటులకు ఉండే అభిమానుల ప్రేమ, అభిమానంతో చేసే పనులు ఎంత ప్రత్యేకమో తెలిసిందే. కొందరు తమ అభిమాన హీరోల కోసం గుడులు కడితే, మరికొందరు అన్నదానాలు, రక్తదానాలు చేస్తూ తమ అభిమానం చాటుకుంటుంటారు. అయితే అదే అభిమానం కొన్ని సందర్భాల్లో మితిమీరితే సెలబ్రిటీలకు ఇబ్బందులు కూడా కలుగుతాయని యాక్షన్ కింగ్ అర్జున్ ఇటీవల ఓ ఇంటర్వ్యూలో వెల్లడించారు.తనకు ఎదురైన ఓ సంఘటనను గుర్తుచేసుకుంటూ అర్జున్ ఆసక్తికర విషయాలు పంచుకున్నారు. గతంలో నెల్లూరులో ఒకసారి హోటల్ నుంచి కారులోకి వెళ్లే సమయంలో భారీ సంఖ్యలో అభిమానులు గుమిగూడారని తెలిపారు. తనతో సెక్యూరిటీ ఉన్నప్పటికీ, అభిమానులు ఉత్సాహంలో వారిని పక్కకు తోసేసి తన దగ్గరకు వచ్చారని చెప్పారు. ఆ తొందరలో తాను చాలా కష్టపడి కారులోకి ఎక్కి వెళ్లిపోయానని, తాను వెళ్లిన తర్వాతే సెక్యూరిటీ సిబ్బంది అక్కడికి చేరుకున్నారని వివరించారు. అభిమానులు ప్రేమతోనే వస్తారని తెలుసు కానీ, ఆ ప్రేమ కొన్ని సార్లు ఇబ్బంది కలిగిస్తుందని అర్జున్ వ్యాఖ్యానించారు. ప్రస్తుతం అర్జున్ దర్శకత్వంలో తెరకెక్కుతున్న "సీతా పయనం" సినిమా ప్రమోషన్స్‌లో ఆయన బిజీగా ఉన్నారు.





# శ్రీలీలని పలకరిస్తున్న వరుస ఫ్లాపులు.

సౌత్ ఇండస్ట్రీలో యంగ్ హీరోయిన్లలో అచ్చ తెలుగమ్మాయిగా గుర్తింపు తెచ్చుకున్న శ్రీలీల వరుస అవకాశాలతో దూసుకుపోతోంది. ఎనర్జీ, డ్యాన్స్, స్క్రీన్ ప్రెజెన్స్‌తో తక్కువ సమయంలోనే ఆమె మంచి గుర్తింపు సంపాదించింది. రవితేజతో చేసిన ధమాకా ద్వారా తెలుగులో తొలి భారీ హిట్ అందుకున్న ఈ బ్యూటీ, హిట్లుఫ్లాపులతో సంబంధం లేకుండా వరుసగా ఛాన్సులు దక్కించుకుంటూ బిజీగా మారింది. తన టాలెంట్‌తో నిర్మాతల దృష్టిని ఆకర్షిస్తూ కమర్షియల్ సినిమాల్లో ప్రత్యేక ఇమేజ్‌ను నిర్మించుకుంది. టాలీవుడ్‌లో స్టార్ హీరోల సరసన నటించిన శ్రీలీల, మాస్ ఎంటర్‌టైనర్ల నుంచి లవ్ స్టోరీల వరకు విభిన్న కథలను ఎంచుకుంటూ కెరీర్‌ను విస్తరించుకుంటోంది. ఇదే సమయంలో కోలీవుడ్‌పైనా దృష్టి సారించింది. శివకార్తికేయన్ హీరోగా తెరకెక్కిన పరాశక్తి చిత్రంతో తమిళ ప్రేక్షకులకు పరిచయమైన ఆమె, అక్కడ కూడా అవకాశాలు అందుకుంటోంది. ఇక తాజాగా ధనుష్ హీరోగా రాజ్ కుమార్ పెరియాసామి దర్శకత్వంలో రూపొందుతున్న 'ఐ55' (వర్కింగ్ టైటిల్) ప్రాజెక్ట్‌లో శ్రీలీల హీరోయిన్‌గా నటిస్తోంది. ఈ చిత్రాన్ని వండ్ బార్ సంస్థ నిర్మిస్తోంది. ఇందులో సాయి పల్లవి కూడా కీలక పాత్రలో కనిపించనుండటం ఆసక్తిని పెంచుతోంది. ఈ సినిమా ద్వారా కోలీవుడ్‌లో తన స్థానం మరింత బలపరచుకోవచ్చని సినీ వర్గాలు భావిస్తున్నాయి. ఇదిలా ఉంటే, ఇప్పుడు మరో క్రేజీ ప్రాజెక్ట్ విషయంలో శ్రీలీల పేరు గట్టిగా వినిపిస్తోంది. తమిళ స్టార్ అజిత్ కుమార్ హీరోగా తెరకెక్కనున్న కొత్త చిత్రంలో ఆమె హీరోయిన్‌గా ఎంపికయ్యే అవకాశముందని టాక్ నడుస్తోంది. 'గుడ్ బ్యాడ్ అగ్లీ' తర్వాత రేసింగ్‌పై దృష్టి పెట్టిన అజిత్, అదే చిత్ర దర్శకుడు అధిక్ రవిచంద్రన్ తో మరోసారి చేతులు కలపబోతున్నట్లు సమాచారం. ఈ ప్రాజెక్ట్ భారీ యాక్షన్ ఎంటర్‌టైనర్‌గా రూపొందనుందని చెబుతున్నారు. ఈ సినిమాలో అజిత్‌కు సమానంగా బలమైన మహిళా పాత్ర ఉండేలా కథను డిజైన్ చేస్తున్నారని కోలీవుడ్ వర్గాల్లో చర్చ జరుగుతోంది. ఆ పాత్ర కోసం శ్రీలీల పేరును పరిశీలిస్తున్నట్లు వార్తలు వస్తున్నాయి. ఒకవేళ ఈ కాంబినేషన్ కుదిరితే, శ్రీలీల కెరీర్‌లో ఇది కీలక మైలురాయిగా మారే అవకాశం ఉందని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. అయితే ఈ విషయంపై చిత్ర బృందం నుంచి ఇంకా అధికారిక ప్రకటన వెలువడలేదు.